నేటి కందం- నేటికి అందం

తీయని కబురుల నొసగుచు
పాయక సంతోషపరచు పరికరమగు-యాం
డ్రాయిడు ఫోను నొసంగిన
శ్రేయోగుణులను గొలుతును చిన్మయ వృత్తిన్ !!

(5-11-2007 యాండ్రాయిడ్ ఫోను ప్రజలకు చేరిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

అధికారంలెవరున్నా
అవినీతే కదా నేస్తం
అవున్నా కాదన్నా
అదే వారి సమస్తం
పవిత్రత ప్రమాణాలు
ప్రజల ముందు దరువు
అణువంత నిజమైనా
అందులో పూర్తి కరువు



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 5-11-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:74 పేజీలు:6 వెల: రూ.1/-


## ధాన్యం కొనుగోళ్లపై రేవంత్ ప్రత్యేక దృష్టి .. ప్రత్యేక అధికారుల నియామకం



హైదరాబాద్, నవంబర్ 4: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్?ను ప్రత్యేక అధికారి గా నియమించింది. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏవైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు.

ప్రత్యేకాధికారులు;

ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం అసిఫాబాద, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్య,

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్?వీ కర్ణన్?,

నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డా. ఏ.శరత్

రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్?గిరి జిల్లాలకు డి.దివ్య,

మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి,

వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి.వినయ కృష్ణ రెడ్డి

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె.సురేంద్ర మోహన్

## హామీలు నెరవేర్చకుండా బుకాయింపు.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4: రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం ప్రజలను కాంగ్రెస్ పార్టీ వంచనకు గురిచేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం బుకాయిస్తుందని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోపు అమలు చేస్తామని చెప్పారని, నేటికీ అందులో ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేకపోయారన్నారు.

ఎన్నికల సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీతో సహా ఆ పార్టీ నేతలంతా విచ్చలవిడిగా హామీలు ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీలు ఏమయ్యాయని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం ప్రజలను వంచించారని ఆరోపించారు. కేవలం డిక్లరేషన్లు, గ్యారెంటీలతో కాంగ్రెస్ పార్టీ జనాలను నిలువునా మోసం చేసిందని ధ్వజమెత్తారు. తెలంగాణతో సహా కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో పరిస్థితులు ఇలానే ఉన్నాయని ఎద్దేవా చేశారు.

మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ సర్కార్ కూడా అదే బాటలో పయనిస్తుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ లు రెండు కుటుంబ పార్టీలేనని.. దొరికిన చోటు అప్పులు తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అప్పులు తీర్చడం కోసం మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. కొన్నాళ్లకు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి కూడా ఎంతో దూరంలో లేదని కిషన్‌రెడ్డి అన్నారు.

## భారత వైమానిక రంగానికి చెందిన మహిళా విజేతలతో ముచ్చటించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీ, నవంబర్ 4:ఈ రోజు (నవంబర్ 4న) రాష్ట్రపతి భవన్ లో "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమంలో భాగంగా భారత వైమానిక రంగానికి చెందిన మహిళా విజేతల బృందంతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముచ్చటించారు. పౌరులను నేరుగా కలుసుకుని, జాతి పురోభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని గుర్తించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ... వైమానిక రంగ నిర్వహణ, సాంకేతిక విభాగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు – ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ విధుల్లో 15 శాతం, ఫ్లైట్ డిస్పాచర్లుగా 11 శాతం, ఏరోస్పేస్ ఇంజనీర్లుగా 9 శాతం మంది బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని శ్రీమతి ముర్ము తెలిపారు. గత సంవత్సరం 18 శాతం మంది మహిళలు కమర్షియల్ పైలట్లుగా లైసెన్సులు సాధించారని అన్నారు. సృజనాత్మకంగా ఆలోచిస్తూ, కొత్త పంథాను ఎంచుకున్న మహిళలకు రాష్ట్రపతి అభినందనలు తెలియజేశారు.


సమ్మిళిత అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల వైమానిక రంగంలో మహిళలకు ప్రోత్సాహం లభిస్తోందని, ఈనాడు మహిళలు పెద్ద సంఖ్యలో ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారని రాష్ట్రపతి తెలిపారు. వైమానిక రంగంలో మహిళలకు భాగస్వామ్యం కల్పించడం సహా, వారి పురోగతికి అవసరమైన సమాన అవకాశాలను కల్పించడం ఎంతో అవసరమని శ్రీమతి ముర్ము అన్నారు.

మహిళలు ముందంజ వేసేందుకు విద్య, శిక్షణావకాశాలు సహా, కుటుంబ సహకారం తప్పనిసరి అనీ, సరిగ్గా ఇటువంటి సహకారం లేనందువల్లే అనేకమంది మహిళలు ఉన్నత విద్యావంతులైనప్పటికీ తమ కలలను సాకారం చేసుకోలేకపోతున్నారనీ శ్రీమతి ముర్ము అభిప్రాయపడ్డారు. వృత్తిలో విజయం సాధించిన మహిళలు, తోటి స్త్రీలకు మార్గనిర్దేశం చేస్తూ, వారు కూడా తమ కలల్ని సాకారం చేసుకునేలా ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు.

## ఈ నెల 8 నుంచి సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర

హైదరాబాద్, నవంబర్ 4:సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 8 నుంచి పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ నెల 8న తన పుట్టిన రోజు సందర్భంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ వెంట పాదయాత్ర చేయనున్నారు. పాదయాత్రలో మూసీ పరివాహక ప్రాంతంలోని రైతులు, ప్రజలను కలిసి, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకోనున్నారు. కాగా, సీఎం పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హెలిప్యాడ్, ఆలయ పరి సరాలను పరిశీలించారు. అధికారుల కు పలు సూచనలు చేశారు. ఏర్పాట్ల లో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

## సహకార సంఘ భవనాన్ని ప్రారంభించిన దామోదర్ రాజనర్సింహ



మెదక్, నవంబర్ 4: మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని మహమ్మద్ నగర్ కొత్త గేటు సమీపాన నూతనంగా రూ. 54 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మహమ్మద్ నగర్ పిఏసిఎస్ అధ్యక్షుడు బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య సేవలకు ప్రభుత్వం పెద్దపీట : దామోదర్ రాజనర్సింహ



మెదక్, నవంబర్ 4: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల వైద్య సేవలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర వైద్య రంగాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్ది వైద్య, ఆరోగ్య సేవలకు పెద్ద పీట వేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.

సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో రూ.50లక్షలతో నూతనంగా 5 బెడ్స్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఆధునిక డయాలసిస్ కేంద్రాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో అత్యుత్తమంగా తీర్చిదిద్ది ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని, రూరల్ ప్రాంతంలో కూడా డయాలసిస్ సేవలను అందుబాటులోకి తెస్తున్నామని,

ఈ క్రమంలోనే నర్సాపూర్ లో ఆధునిక డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు..

## కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, నవంబర్ 4: విజయవాడ కనకదుర్గ అమ్మవారిని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. అంతకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనం ఎంతో సంతోషంగా ఉన్నారు.

రాష్ట్రంలో కులగణన చేపట్టి తీరుతామన్నారు. ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యూమరేటర్ ఉంటారు. కులగణన ద్వారా తెలంగాణ ఒక దిక్సూచి కావాలన్నారు. కులగణన మీద అందరూ పలు విధాలుగా మాట్లాడుతున్నారు. ఎవరు ఏం చెప్పినా మేం కులగణన పూర్తి చేస్తామన్నారు.

## ఆగ్రా సమీపంలో కూలిన మిగ్-29



ఆగ్రా నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఎంఈ)కి చెందిన మిగ్-29 ఫైటర్ జెట్ సోమవారం ఆగ్రా సమీపంలో కూలిపోయింది. అయితే పైలట్ సురక్షితంగా బయటపడగలిగాడని వార్తా సంస్థ ఏఎన్ఐ తెలిపింది. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలు క్రాష్ సైట్ వద్ద మండుతున్న శిధిలాలను చూపించాయి. పంజాబ్‌లోని అదంపూర్ నుంచి ఆగ్రాకు విమానం ఎక్సర్‌సైజ్ నిమిత్తం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కోర్టు విచారణకు ఆదేశించారు.


ఆగ్రా నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఎంఈ)కి చెందిన మిగ్-29 ఫైటర్ జెట్ సోమవారం ఆగ్రా సమీపంలో కూలిపోయింది. అయితే పైలట్ సురక్షితంగా బయటపడగలిగాడని వార్తా సంస్థ ఏఎన్ఐ తెలిపింది. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలు క్రాష్ సైట్ వద్ద మండుతున్న శిధిలాలను చూపించాయి. పంజాబ్‌లోని అదంపూర్ నుంచి ఆగ్రాకు విమానం ఎక్సర్‌సైజ్ నిమిత్తం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కోర్టు విచారణకు ఆదేశించారు.


## ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు పెరగాలన్నారు. సర్కారు బడుల అభివృద్ధికి సమాజమంతా బాధ్యత తీసుకోవాలని సూచించారు

మెరుగైన ఫర్నిచర్, ల్యాబ్స్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విద్యానగర్ జామై ఉస్మానియా పాఠశాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు..కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యం కనిపిస్తోందన్నారు

దివాళకోరు, దగాకోరు రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు.

అమలు కానీ హామీలు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని కిషన్ రెడ్డి చురకలంటించారు.

ఇచ్చిన హామీలకే గతిలేదని, కొత్తగా మళ్లీ హామీలిస్తున్నారన్నారు.


కర్నాటకలో హామీలు అమలు చేయలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో అనేక వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారులోకి వచ్చిందని దుయ్యబట్టారు. డిక్లరేషన్, గ్యారంటీల పేరుతో గారడీ చేశారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు

## కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో ఎండీ హోమియో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, నవంబర్ 4: కాళోజీ నారాయణ రావు హెల్త్ యూని వర్సిటీలో ఎండీ హోమియో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నవంబర్ 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నవంబర్ 10 సాయంత్రం 6 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ అనంతరం వెబ్ ఆప్షన్ల నమోదు కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. వెబ్ ఆప్షన్ల నమోదు తర్వాత మెరిట్ లిస్ట్ విడుదల చేయనున్నారు. దరఖాస్తుతో పాటు తదితర వివరాల కోసం knruhs.tel angana.gov.in అనే వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చు.

## లోయలో పడిన బస్సు: 23 మంది మృతి



డెహ్రాడూన్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉత్తరాఖండ్ రాష్ట్రం అల్మోరా జిల్లా మర్చులా వద్ద సోమవారం ఉదయం బస్సు లోయలో పడింది. రామ్ నగర్ లోని కుపి శివారులో బస్సు అదుపు తప్పి లోయలో పడిపోవడంతో 23 మంది దుర్మరణం చెందగా 17 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రెస్క్యూ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ఆస్పతికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. 40 యాత్రికులతో బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## ఈనెల 10న చిత్రపు హనుమంతరావు గ్రంథాల ఆవిష్కరణ

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రముఖ రచయిత చిత్రబానుమంతరావు రచించిన 'ఏడడుగులు' (నవలికలు) 'వర్ణ చిత్రం' కథల సంపటి గ్రంథాల ఆవిష్కరణ సభ ఈనెల 10వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో మానస ఆర్ థియేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రసార కళా ప్రవీణ డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ రచయిత విహారి ముఖ్యఅతిథిగా విచ్చేసి రెండు గ్రంథాలను ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమం లో సాహితీవేత్తలు ఆర్ నాగేశ్వరరావు ప్రేమ మాన్వి సిఎస్ రాంబాబు తాళ్లపల్లి మురళీధర్ గౌడ్ అతిథులుగా పాల్గొంటారని మానస ఆర్ట్ థియేటర్స్ అధ్యక్ష కార్యదర్శులు బండారుపల్లి రామచంద్రారావు రఘుశ్రీ తెలిపారు

## కాంగ్రెస్ ఆర్జేడీలు గిరిజన వ్యతిరేకులు.. జార్ఖండ్ ఎన్నికల సభలో ప్రధాని మోదీ నిప్పులు..!

న్యూఢిల్లీ, నవంబర్ 4:కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్రమోదీ నిప్పులు చెరిగారు. ఏనాడూ గిరిజనులను గౌరవించలేదని ఆరోపించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల గౌరవం, హుందాతనానికి నిలువెత్తు సాక్షి జార్ఖండ్, భారత స్వాతంత్ర్యం, సంస్కృతి, వారసత్వాన్ని కాపాడటంలో గిరిజనుల ధైర్య సాహసాలే కీలక పాత్ర పోషించాయన్నారు.

'గిరిజనులకు ఆర్జేడీ (రాష్ట్రీయ జనతాదళ్), కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద శత్రువులు. జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన ఆ పార్టీలకు జేఎంఎం (జార్ఖండ్ ముక్తి మోర్చా) మద్దతు పలుకుతుంది' అని మోదీ ఆరోపించారు. 'గిరిజనులను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాల్చి చంపింది. నిరంకుశ ఇంగ్లిష్ పాలకులకు కొల్హాన్ విసిరిన సవాల్‌కు చరిత్రే సాక్షి. ఈనాడు నిరంకుశ జేఎంఎం-కాంగ్రెస్- ఆర్జేడీ కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు కొల్హాన్ మరోసారి సిద్ధమైంది' అని వ్యాఖ్యానించారు.

# సునామీ నష్టనివారణలో భవిష్యత్తు తరాలను సన్నద్ధం చేద్దాం !

## (05 నవంబర్ "ప్రపంచ సునామీ అవగాహన దినం" సందర్భంగా)

సముద్రంలో భూకంపాలు రావడం, వాల్కనో విస్ఫొటనాలు జరగడం, కొండచరియలు విరిగిపడడం, అగ్నిపర్వతాలు బద్దలు కావడం, ఉల్కాపాతం ఉద్భవించడం లాంటి విపత్తులు సంభవించినపుడు సముద్రపు అలలు నోళ్ళు తెరుచుకొని ఉవ్వెత్తున 100 అడుగుల ఎత్తు వరకు ఎగిసిపడుతూ, గంటకు 800 కిమీ వేగంతో రాకాసి అలలు ప్రయాణిస్తూ, తీర ప్రాంత జనావాసాలను మహా విపత్తు ముంచేయడమనే సునామీ అని అంటాం. 26 డిసెంబర్ 2004 తొలి సారి హిందూ మహాసముద్రంలో భూకంపం రావడంతో ప్రపంచ చరిత్రలో ఓ అత్యంత విధ్వంసకర సునామీ రావడం, 14 దేశాలకు చెందిన 2,83,000 మందిని పొట్టన పెట్టుకోవడం చూసాం.

### భవిష్యత్తు తరాలను సన్నద్ధం చేద్దాం:

సునామీ అనబడే జపానీస్ పదానికి "హార్బర్ కెరటం" అని అర్థం. పసిఫిక్ మహాసముద్రంలో "రింగ్ ఆఫ్ ఫైర్" కారణంగా 80 శాతం వరకు సునామీలు సంభవిస్తున్నాయి. ఇలాంటి అత్యంత ప్రమాదకర సునామీ ప్రళయాల్లో నష్టాన్ని తగ్గించడానికి ముందస్తు గుర్తించడం, హెచ్చరికలు జారీ చేయడం, సత్వరమే చర్యలకు పూనుకోవడం, ఆధునిక పరిశోధనలతో సునామీ రాకను ముందే పసిగట్టడం, తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం లాంటి లక్ష్యాలను పెట్టుకొని 2015లో ఐరాస సభ్యదేశాలు తీసుకున్న నిర్ణయం ప్రకారం 2016 నుంచి ప్రతి ఏట 05 నవంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "ప్రపంచ సునామీ అవగాహన దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ సునామీ అవగాహన దినం-2024 థీమ్‌గా "గత చరిత్ర నుంచి గుణపాఠం పొందుతూ తర్వాత తరాలను సన్నద్ధం చేయడం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు.

### సునామీ విపత్తుల నష్టాలను తగ్గించడం:

సునామీ విపత్తుల పట్ల విషయ పరిజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, విపత్తు ప్రమాదపు అంచున నివసిస్తున్న తీర ప్రాంత ప్రజలను సన్నద్ధంమచేయడం, గత సునామీ చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం, సునామీ బాధితులకు సంఘీభావం తెలియజేయడం, ఆధునిక డిజిటల్ శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో సునామీలను ముందస్తు అంచనాలతో హెచ్చరికలు జారీ చేయడం, ప్రపంచ దేశాలు సమన్వయంతో పని చేయడం, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని ఏకరువు పెట్టడం, రాబోయే తరాలకు సునామీ పట్ల కనీస జ్ఞానాన్ని అందించడం లాంటి అంశాలు సునామీ వల్ల జరిగే ప్రాణ ఆస్తి నష్టాలను పూర్తిగా తగ్గిస్తాయని గమనించాలి.

పర్యావరణ కాలుష్యంతో సంభవిస్తున్న ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా కూడా సునామీలు ఎగిసిపడవచ్చని తెలుసుకుందాం. సునామీ విపత్తుల గూర్చి పూర్తి అవగాహనను ఆకలింపు చేసుకుందాం. సునామీలు నేర్పిన గత గుణపాఠాలను మరువకుండా రాబోయే రోజుల్లో రాకాసి అలల వలలో పడకుండా తీర ప్రాంత మానవాళిని కాపాడుదాం. సునామీ సృష్టించే విధ్వంసానికి అడ్డుకట్ట వేద్దాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన కోల్ ఇండియా

న్యూఢిల్లీ, నవంబర్ 4:భారతదేశపు బొగ్గు అవసరాలనూ తీర్చుతూ ఇంధన రంగాన్ని బలోపేతం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) నవంబరు1, 2024 నాటికి 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. 1975 నవంబరు ఒకటో తేదీన ఈ సంస్థ ఏర్పడింది. కోకింగ్ కోల్ (1971), నాన్ కోకింగ్ మైన్స్ (1973) కంపెనీలను జాతీయం చేయడం ద్వారా కోల్ ఇండియా రూపుదిద్దుకుంది.

సీఐఎల్ ఏర్పడిన తొలి ఏడాది అంటే 1975-76 నాటికి 89 మిలియన్ టన్నులుగా ఉన్న ఉత్పత్తి, 2024 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి బొగ్గు మంత్రిత్వశాఖ కింద ఉన్న ఈ మహారత్న కంపెనీ- 773.6 మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని సాధించింది. ఉత్పత్తి 8.7 రెట్లు పెరిగింది. మొత్తం ఉత్పత్తిలో 80 శాతం ప్రధానంగా థర్మల్ పవర్ ప్లాంట్లకు సరఫరా అవుతున్నది. బొగ్గును మార్కెట్ రేటు కంటే అతి తక్కువగా అందిస్తూ పౌరులందరికీ చౌక ధరకే విద్యుత్తును అందించడంలో సీఐఎల్ కీలకపాత్ర పోషిస్తోంది. జాతీయీకరణ సమయంలో 6.75 లక్షల మంది ఉద్యోగులుండగా, నేడు 2.25 లక్షల మంది మాత్రమే ఉన్నారు. అయినా ఉత్పత్తి మాత్రం పెరుగుతూనే ఉంది.

కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి జి.కిషన్ రెడ్డి కోల్ ఇండియాకు అభినందనలు తెలిపారు. "అనేక విజయాలను సాధించి గోల్డెన్ జూబిలీ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న కోల్ ఇండియాను అభినందిస్తున్నాను. బొగ్గు ఉత్పత్తి భారతదేశంలో శిఖరస్థాయిని ఇంకా అందుకోవాల్సి ఉంది. దిగుమతులను తగ్గించుకోవడానికి స్థానిక ఉత్పత్తి చాలా కీలకం. ప్రజల వరంగా సామాజిక బాధ్యత, సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యమిస్తూనే, భవిష్యత్తులో బొగ్గు ఉత్పత్తిని కోల్ ఇండియా గణనీయంగా పెంచాల్సి ఉంటుంది" అని వ్యాఖ్యానించారు.

దాదాపు అయిదు దశాబ్దాల ప్రయాణం- కోల్ ఇండియాకు ఒక ప్రత్యేకమైన పండుగ. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ, అనేక మార్పులకు లోనవుతూ కూడా... ప్రజల ఆశల్ని నెరవేరుస్తూనే వస్తున్నది. ఈ బొగ్గు ఉత్పత్తి కంపెనీ నేడు సోలార్ పవర్, పిట్ హెడ్ పవర్ స్టేషన్లు, కోల్ గ్యాసిఫికేషన్, కీలక ఖనిజాల వంటి కార్యకలాపాల్లోకి కూడా ప్రవేశిస్తోంది.

సంస్థ పరిధికి పరిమితమై, వ్యవస్థాపక దినోత్సవాన్ని కోల్ ఇండియా 2007 నుంచి నిర్వహిసోంది. ఈ సందర్భంగా ప్రతి ఏటా సంస్థ పూర్వ ఛైర్మన్లు, లేదా పరిశ్రమ నిపుణులు... జేబీ కుమారమంగళం స్మారకోపన్యాసం చేస్తారు. తర్వాత ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి అవార్డులను అందిస్తారు. ఈ సంవత్సరం కూడా నవంబరు 3న కోల్ కతాలో వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి బొగ్గు మంత్రి ముఖ్యఅతిథిగా, బొగ్గు శాఖ కార్యదర్శి గౌరవ అతిథిగా హాజరవుతున్నారు.

# క్షయవ్యాధిపై పోరాడడంలో భారత్ సాధిస్తున్న పురోగతికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, నవంబర్ 4:టీబీ వ్యాప్తిని తగ్గించే దిశలో మన దేశం సాధిస్తున్న విజయాలను గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ఇది క్షయవ్యాధి ని నిర్మూలించడానికి భారతదేశం చేస్తున్న కృషికి లభించిన ఒక గొప్ప గుర్తింపు అని చెప్పుకోవచ్చు.

క్షయవ్యాధి వ్యాప్తిని 2015 నుంచి 2023 మధ్య కాలంలో 17.7 శాతం మేరకు భారత్ తగ్గించిందంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొనగా, ఇది మన దేశం సాధించిన అసాధారణ ప్రగతికి దక్కిన గుర్తింపు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా తెలిపారు. దీనిపై ప్రధాన మంత్రి సామాజిక ప్రసార మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందిస్తూ, ఈ కింది విధంగా రాసుకొచ్చారు:

"ఇది ప్రశంసించదగ్గ పురోగతి అని చెప్పాలి. భారత్ అంకితభావంతో ఒడిగట్టి కొత్త కొత్త ప్రయత్నాలను కొనసాగిస్తూ పోతున్న ఫలితంగానే టీబీ వ్యాప్తి లో ఈ తగ్గుదల నమోదైంది. మనమందరం ఏకతాటి మీద నిలిచి, టీబీకి తావు ఉండనటువంటి భారత్ ను సాకారం చేసేందుకు పాటుపడు తూనే ఉందాం."

# బ్రెజిల్ లో జరిగిన జి-20 డీఆర్ఆర్ డబ్ల్యూజీ మంత్రుల సమావేశంలో పాల్గొన్న భారత ప్రతినిధి బృందం

న్యూఢిల్లీ, నవంబర్ 4:ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీకే మిశ్రా నేతృత్వంలో అత్యున్నతస్థాయి ప్రతినిధి బృందం 2024, అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబరు ఒకటో తేదీ వరకూ బ్రెజిల్ దేశంలోని బెలెంలో జరిగిన జి-20 డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ (గ్రూపు (డీఆర్ఆర్ డబ్ల్యూజీ) మంత్రుల సమావేశంలో పాల్గొన్నది.

భారత ప్రతినిధి బృందం చురుగ్గా నిర్వహించిన చర్చల కారణంగా విపత్తు ప్రమాదాన్ని తగ్గించుకోవడం (డీఆర్ఆర్)పై మంత్రుల సమావేశపు తొలి ప్రకటనపై ఏకాభిప్రాయం సుసాధ్యం అయింది. విపత్తు ప్రమాదాల తీవ్రతను తగ్గించుకోవడంలో భారత ప్రభుత్వం సాధించిన పురోగతినీ, విపత్తు పరంగా పెట్టుబడులను పెంపుదల అంశాలనీ డాక్టర్ పీకే మిశ్రా... మంత్రులు నిర్వహించిన వివిధ చర్చల్లో వివరించారు. జి-20 ఆతిథ్య దేశంగా డీఆర్ఆర్ డబ్ల్యూజీ పరంగా గుర్తించిన- ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, విపత్తును తట్టుకునే మౌలిక సదుపాయాలు, డీఆర్ఆర్ పెట్టుబడులు, విపత్తు అనంతర పునర్నిర్మాణం, ప్రకృతి పరిష్కారాలు- అన్న అయిదు ప్రాధాన్యాంశాలను దృష్టిలో ఉంచుకుని విపత్తు ప్రమాదాల నివారణ దిశగా భారతదేశం తీసుకుంటున్న క్రియాశీలక చర్యలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. విపత్తును తట్టుకునే మౌలిక సదుపాయాల విషయంలో- కొయిలిషన్ ఫర్ డిజాస్టర్ రెజిలియన్స్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (సీడీఆర్ఐ) పేరుతో అంతర్జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి చేపట్టిన కార్యక్రమాన్ని వివరించారు. ప్రస్తుతం ఈ సంఘంలో 40 దేశాలూ, 7 అంతర్జాతీయ సంస్థలూ సభ్యత్వం తీసుకున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా విపత్తుల నివారణ కోసం సెండాయ్ ప్రణాళికకు కట్టుబడి ఉన్నట్లు ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. విపత్తులను తట్టుకునేట్లు ప్రపంచాన్ని తయారు చేసేందుకు అవసరమైన విజ్ఞానాన్ని పంచుకోవడం, సాంకేతిక బదిలీ, సుస్థిరమైన అభివృద్ధి అంశాల్లో అంతర్జాతీయ సహకారం మరింత విస్తృతం కావాల్సిన అవసరాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

బ్రెజిల్, దక్షిణాఫ్రికా మంత్రులు నిర్వహించిన ట్రోయికా సమావేశంలో కూడా భారతీయ ప్రతినిధి బృందం పాలుపంచుకున్నది. ఆతిథ్య దేశం బ్రెజిల్ తోపాటు, జపాన్, నార్వే, దక్షిణాఫ్రికా, జర్మనీ దేశాల మంత్రులతోనూ, అలాగే అక్కడకు విచ్చేసిన అంతర్జాతీయ సంస్థలతోనూ ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై యూఎన్ఎస్జీ ఇచ్చిన పిలుపుపై స్పందిస్తూ...స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సంప్రదాయ విధానాలను ప్రముఖంగా ప్రోత్సహిస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి తెలిపారు.

భారతదేశం అధ్యక్షతన 2023లో నిర్వహించిన జీ-20 సమావేశాల సందర్భంగా భారతదేశం తీసుకున్న చొరవ కారణంగానే తొలి డీఆర్ఆర్ డబ్ల్యూజీ ఏర్పడింది. డీఆర్ఆర్ డబ్ల్యూజీని కొనసాగిస్తూ, దీనిని మంత్రుల స్థాయికి చేర్చినందుకు జీ-20 సమావేశాలకు ప్రస్తుతం ఆతిథ్యం ఇస్తున్న బ్రెజిల్ దేశాన్ని డాక్టర్ మిశ్రా అభినందించారు. రానున్న జీ-20 సమావేశాలకు అతిథ్యమిస్తున్న దక్షిణాఫ్రికా సమావేశాల్లో కూడా డీఆర్ఆర్ డబ్ల్యూజీ కి మద్దతు పలుకుతామని భారతదేశం హామీ ఇచ్చింది.

ప్రపంచ డీఆర్ఆర్ ప్రయత్నాలను ముందుకు తీసుకుపోవడంలోనూ, విపత్తుల నివారణ ప్రపంచానికి రూపకల్పన చేయడంలోనూ- భారతదేశపు ప్రాధాన్యం మరింత పెరుగుతోందని చెప్పడానికి భారతదేశం ఈ సమావేశాల్లో పాల్గొనడమే నిదర్శనం.

# టిడ్కో గృహాల్లో వసతుల కల్పనకు చర్యలు.. రవీంద్రబాబు




కర్నూల్, నవంబర్ 4: జగన్నాథ గట్టు వద్దనున్న టిడ్కో గృహాల్లో అవసరమైన వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు.

సోమవారం అధికా రులతో కలిసి కమిషనర్ టిడ్కో గృహాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో గృహాల్లో 255 బ్లాకుల్లో 10,000 వేల గృహాలు ఉన్నాయన్నారు. అందులో నివాసముంటున్న లబ్దిదారులు, ఖాళీగా ఉన్న గృహాలకు సంబంధించిన వివరాలతో పాటు విద్యుత్, తాగునీటి కనెక్షన్ వంటి వివరాలను తెలుసుకునేందుకు అధికారులు, సచివాలయ సిబ్బందితో సర్వే చేపట్టామన్నారు. వాటి ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని, అలాగే గృహాల్లో తగు మరమ్మత్తు పనులను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడ్కో డీఈ గుప్తా, నగర పాలక టిడ్కో స్పెషలిస్ట్ అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాత మృతుల కుటుంబాలను ఆదుకుంటాం- చంద్రబాబు

అమరావతి, నవంబర్ 4: తూర్పుగోదావరి జిల్లాలో విద్యుదాఘాతంతో నలుగురు మృతి చెందిన ఘటనపై విచారం వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ప్లెక్సీ కడుతూ వీర్రాజు, నాగేంద్ర, మణికంఠ, కృష్ణ అనే నలుగురు మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేసిన ఆయన ఈ ఘటనలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుం టుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు సీఎం చంద్రబాబు..

ఇక, ఈ ఘటనపైగ్ర్భ్భాంతి వ్యక్తం చేశారు హోంమంత్రి వంగలపూడి అనిత.. సామాజిక విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లలో భాగంగా ప్రమాదం జరగడం చాలా బాధకరమన్నారు. ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్ తో మరణించిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆమె స్పష్టం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు ప్రమాదవశాత్తు అకాల మరణం చెందడాన్ని కుటుంబ సభ్యులు తట్టుకునే ధైర్యం వారి తల్లిదండ్రులకు భగవంతుడు ప్రసాదించాలని వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తణుకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించి కాపాడాలని వైద్యాధికారులను ఆదేశించారు హోం మంత్రి అనిత.

### విద్యుత్ షాక్ బాధిత కుటుంబాలను ఆదుకుంటాం ? మంత్రి కందుల దుర్గేష్..

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపరులో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు కార్యక్రమాల్లో భాగంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న సమయంలో కరెంట్ షాక్ తగిలి నలుగురు వ్యక్తులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేష్ మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు కరెంట్ షాక్ కు గురై మృతి చెందిన మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించిన ఆయన.. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.. ఇక, ప్రమాదానికి గల కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు మంత్రి దుర్గేష్.. మృతుల కుటుంబాలకు అధైర్య పడవద్దని, ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ధైర్యం చెప్పారు.. ఈ ఘటనపైగ్ర్భ్భాంతి వ్యక్తం చేశారు.. అయితే, తొలి కార్తిక సోమవారం. అందరూ ఉదయాన్నే శివాలయాల్లో దీపారాధనకు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలోనే ఆ ఊరిలో నలుగురు యువకులు చనిపోయరని ఆవేదన వ్యక్తం చేశారు..

### మంత్రి కొల్లు, నిమ్మల సంతాపం ..

రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో విద్యుదాఘాతంతో నలుగురు మృతి అత్యంత బాధాకరం అన్నారు.. ప్రమాదంలో మరణించిన వారికి నా ప్రగాఢ సా?భూతిని తెలియజేస్తున్నా.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రమాద ఘటనపై విచారణ జరిపించి వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు మంత్రి కొల్లు రవీంద్ర.. ఇక, విద్యుదాఘాత మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు మంత్రి నిమ్మల రామానాయుడు. మృతుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటాం అన్నారు.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు మంత్రి నిమ్మల రామానాయుడు.

# రాయలసీమను ముంచింది ఈ గడ్డ బిడ్డే - జగన్ పై నిమ్మల గరం గరం

కర్నూలు, నవంబర్ 4: మాజీ సీఎం జగన్ రాయలసీమ బిడ్డ అయినా ఇక్కడ ఇరిగేషన్ వథకాలను పట్టించుకోలేదని ఏపి నీటి పారుదల శాఖ మంత్రి , కర్నూలు ఇంచార్జ్ మంత్రి రామానాయుడు అన్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆయన నగరంలోని ఉల్లి మార్కెట్ ను తనిఖీ చేశారు. ఆయనతోపాటు పరిశ్రమల శాఖ, ఐటిమంత్రి టిజి భరత్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ , ఉల్లి రైతుకు ఒక్క రూపాయి కూడా నష్టం జరగకూడదన్నారు. వినియోగదారుడుకి భారం కాకుండా మేలు జరిగేలా ఎన్డీయే కూటమి పని చేస్తుందన్నారు.

ఈనామ్ పని చేయకపోతే వెంటనే ఆఫ్లైన్ లో నమోదు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. గత ఏడాది అక్టోబర్ లో 52 వేల టన్నుల ఉల్లి వస్తే దానికి నాలుగు రెట్లు అధికంగా అనగా 2.5 లక్షల టన్నుల ఉల్లి అధికంగా ప్రస్తుతం మార్కెట్కు వచ్చినట్లు గుర్తు చేశారు.

గత ప్రభుత్వంలో హార్టికల్చర్ , డ్రిప్ ఇరిగేషన్ వంటివి అన్నింటినీ గాలికొదిలేశారన్నారు. దళారులు సిండికేట్ అవ్వకుండా కోడుమూరులో కూడా ఉల్లిమార్కెట్ ను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

కర్నూలు జిల్లా ఇంచార్జ్ మంత్రి ,రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడుని కర్నూల్ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ కర్నూలు ప్రభుత్వ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సోమవారం ఇంచార్జ్ మంత్రికి ఎస్పీ పూల మొక్కను అందజేశారు. ఎస్పీతో పాటు కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూల్ టిడిపి ఇన్చార్జి తిక్కారెడ్డి, కర్నూల్ డిఎస్పి జె.బాబు ప్రసాద్ ఉన్నారు. అనంతరం ప్రభుత్వ అతిథి గృహంలో వారి వివిధ అంశాలపై చర్చించారు.

# బుల్డోజర్లకు అడ్డుగా నిలబడుతాం

## -మూసీ పరీవాహక ప్రాంత వాసులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 4: మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు.

మూసీ పరీవాహక ప్రాంతంలోని పేదలకు బుల్డోజర్లతో అన్యాయం చేయాలని చూస్తే.. తాము బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతామని స్పష్టం చేశారు.

ఆదివారం చైతన్యపురి డివిజన్ ద్వారకాపురం కాలనీలో మూసీ పరీవాహక కాలనీలు, బస్తీల ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రేవంత్ సర్కార్ తమ ఇండ్లను ఎప్పుడు కూలుస్తుందోనని పేదలు కంటిమీద కునుకులేకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు తాము అండగా ఉంటామని, అధికారులు మార్కింగ్‌లు వేసినా.. ఎలాంటి నష్టం జరుగనివ్వమని, 'మీ ఇంటికి నేను భరోసా ఇస్తున్నా'నని సుధీర్‌రెడ్డి మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు ధైర్యం చెప్పారు. మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తోట మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


## క్షయవ్యాధిపై పోరాడడంలో భారత్ సాధిస్తున్న పురోగతికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, నవంబర్ 4:టీబీ వ్యాప్తిని తగ్గించే దిశలో మన దేశం సాధిస్తున్న విజయాలను గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ఇది క్షయవ్యాధి ని నిర్మూలించడానికి భారతదేశం చేస్తున్న కృషికి లభించిన ఒక గొప్ప గుర్తింపు అని చెప్పుకోవచ్చు.

క్షయవ్యాధి వ్యాప్తిని 2015 నుంచి 2023 మధ్య కాలంలో 17.7 శాతం మేరకు భారత్ తగ్గించిందంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొనగా, ఇది మన దేశం సాధించిన అసాధారణ ప్రగతికి దక్కిన గుర్తింపు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా తెలిపారు. దీనిపై ప్రధాన మంత్రి సామాజిక ప్రసార మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందిస్తూ, ఈ కింది విధంగా రాసుకొచ్చారు:

"ఇది ప్రశంసించదగ్గ పురోగతి అని చెప్పాలి. భారత్ అంకితభావంతో ఒడిగట్టి కొత్త కొత్త ప్రయత్నాలను కొనసాగిస్తూ పోతున్న ఫలితంగానే టీబీ వ్యాప్తి లో ఈ తగ్గుదల నమోదైంది. మనమందరం ఏకతాటి మీద నిలిచి, టీబీకి తావు ఉండనటువంటి భారత్ ను సాకారం చేసేందుకు పాటుపడుతూనే ఉందాం."


# మాజీ సర్పంచ్ ల అరెస్ట్ అక్రమం : మాజీ మంత్రి వేముల

నిజామాబాద్, నవంబర్ 4: ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ ఉదయం 4గంటలకే మాజీ సర్పంచ్ లను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో బంధించడం హేమమైన చర్య అని, మాజీ సర్పంచ్ ల అక్రమ అరెస్టును తాము బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నామని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. 10నెలల కింద అప్పులు తెచ్చి పనులు చేసిన వాటికి బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారన్నారు. వారు ప్రజలకు పనిచేసిన దానికే డబ్బులు ఇవ్వమంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కోపమొచ్చిందని ప్రశ్నించారు.

ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ కు ఎందుకు మాజీ సర్పంచ్ లంటే ఇంత కోపం అన్నారు. చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డబ్బులు ఉండవు.. పెద్ద పెద్ద బడా కాంట్రాక్టులకు కమిషన్ల కోసం బిల్లులు చెల్లించేందుకు డబ్బులు ఉంటాయన్నారు. సర్పంచ్ లకు డబ్బులు లేవు.. కానీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్ రెడ్డిలకు డబ్బులు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం దగ్గర డబ్బులుంటాయన్నారు.

అలాగే రూ. లక్షన్నర కోట్లతో మూసి ప్రాజెక్ట్ చేపట్టడానికి రేవంత్ రెడ్డి దగ్గర డబ్బులున్నాయన్నారు. బిల్లులు చెల్లింపు చేయకుండా మాఈ సర్పంచ్ లను ప్రభుత్వం వేధిస్తోంది, భయపెడుతోందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, పారిశుద్ధ్యం పడకేసిందన్నారు. మాజీ సర్పంచ్ ల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అంతేకాదు ఇవాళ అక్రమంగా అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్ లను భేషరతుగా వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పెద్దోళ్లను వదిలి పేదలపై హైడ్రా ప్రతాపం


## -ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



హైదరాబాద్, నవంబర్ 4:: పెద్దోళ్ల భవంతులను వదిలేసి పేదలపై హైడ్రా తన ప్రతాపం చూపుతున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. హైడ్రా పేరుతో అధికార పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడుతూ వసూళ్లకు తెగబడుతున్నారన్నారు. మూసాపేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ తన అండ ఉంటుందని, ఎటువంటి కష్టం వచ్చినా తీర్చేందుకు ముందు వరుసలో ఉంటానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల కోట్ల నిధులను వెచ్చించి అనేక అభివృద్ధి పనులను చేపట్టగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి సున్నా అని విమర్శించారు. కాంగ్రెస్ , బీజేపీలను గెలిపిస్తే తెలంగాణ ప్రజలకు ఏం న్యాయం చేశారని కృష్ణారావు ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలు కుమ్మక్కై బీఆర్ఎస్ తిట్టడం తప్ప ప్రజలకు ఏమాత్రం మంచి చేయడం లేదన్నారు. పేద ప్రజలకు తాను అండగా ఉంటానని, ఎవరూ ఆందోళన చెందాల్సి అవసరం లేదని ఎమ్మెల్యే కృష్ణారావు భరోసా ఇచ్చారు.

# జిల్లా యాదవ సంఘం నిర్మాణంలో గోవిందరావు సేవలు మరువలేనివి

**- చంద్రకాని గోవిందరావు దశదినకర్మ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్**



ఖమ్మం, నవంబర్ 4: (నేటినిజం ప్రతినిధి):1992-93లో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జిల్లా యాదవుల ఐక్యత కోసం యాదవ సంఘం అభివృద్ధి కోసం చంద్రకాని గోవిందరావు చేసిన కృషి మరువలేనిదని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తూరు సింహాద్రి యాదవ్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన చంద్రకాని గోవిందరావు స్వగృహం నేలకొండపల్లి మండలం భైరవుని పల్లి గ్రామంలో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో అఖిల భారత మహాసభ నాయకులు పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి గోవిందరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఉద్యోగం ఉన్నప్పటికీ, పదవీ విరమణ అయిన తర్వాత కూడా యాదవుల అభ్యున్నతి కోసం ఆలోచించేవాడని, నాటి యాదవ సంఘం పెద్దలు బోళ్ల వెంకటేశ్వరరావు, అమరబోయిన సైదయ్య, మీగడ కన్నయ్య, నాటి మంత్రి సంగెం రెడ్డి సత్యనారాయణ, చిత్తారు శ్రీహరి, దుబాకుల శ్రీనివాస్ లాంటి పెద్దల సహకారంతో గోవిందరావుతో పాటు నేను కూడా ఆ రోజులలో జిల్లా అంతట పర్యటించి, గొర్రెల సంఘాల ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని మల్లి బాబు యాదవ్ గుర్తు చేసుకున్నారు. ఆనాడు ఎలాంటి స్వార్థం లేకుండా పనిచేశారని కృషి ఫలితమే ఈనాటి యాదవ సంఘం అభివృద్ధి అని తెలిపారు. యాదవ సంఘం పెద్దలమని చెప్పుకుని తిరిగే ఈనాటి నాయకులు ఆ రోజులలో కంటికి కూడా కనిపించలేదని అలాంటి వ్యక్తి చనిపోవడం నాకు వ్యక్తిగతనీగా తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుబాకుల శ్రీనివాస్, మల్లెబోయిన శ్రీనివాస్, మేకల లక్ష్మీనారాయణ, చంద్రకాంత్, గట్టయ్య, బుర్ర వెంకన్న, కనక బండి కనకరాజు, కనక బండి రమేష్, మేకల మల్లికార్జునరావు, తదితరులున్నారు.

# సోషల్ మీడియాపై నిఘా- హోమ్ మంత్రి అనిత




తిరుపతి, నవంబర్ 4:అదుపు తప్పే సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టేందుకు ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి సెమినార్ హాల్‌లో ఈరోజు సాయంత్రం తిరుపతి, చిత్తూరు జిల్లాల పోలీస్ అధికారులతో ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర శాంతి భద్రతల ఐజి సిహెచ్. శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ డా.షేముషి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు పాల్గొని? శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న విధివిధానాలను మంత్రికి వివరించారు.

అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ? పోలీసుల పనితీరు భవిష్యత్ వ్యూహాలు కార్యాచరణ నేరాల నియంత్రణ, సమర్థవంతమైన పోలీసింగ్ ముఖ్య లక్ష్యమని అన్నారు. పోలీసు శాఖలో సాంకేతికతను ఇనుమడింపజేసి స్మార్ట్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తామన్నారు.

ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించి, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని, భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమర్థవంతంగా పని చేయాలని అధికారులకు సూచించారు. సామాజిక మాధ్యమాలపై నిఘా పెంచేందుకు ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించామని, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నియంత్రించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటామన్నారు.

అత్యాధునిక సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని.. వీటి ద్వారా దేవాలయాలు, ఆసుపత్రులు, మసీదులు, పాఠశాలలు, కళాశాలలు మొదలగు చోట్ల ఏర్పాటు చేస్తూ నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద డ్రోన్‌లు, సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచి గంజాయి, ఇసుక, ఎర్రచందనం తదితర అక్రమ రవాణా జరగ కుండా కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రతి సబ్ డివిజన్ కు మౌలిక వసతులతో కూడిన నైట్ విజన్ డ్రోన్ లను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు.

నేర నియంత్రణ చేయడంలో గాని.. మహిళలు, పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారి పట్ల గాని, హత్యలు ఆత్మహత్యలు ప్రేరేపించే వారి పట్ల కఠినంగా వ్యవహరించి..వారు నేరం చేయాలంటే భయపడే విధంగా క్రియాశీలకంగా సమర్థవంతంగా పనిచేసే విధంగా రూపొందించే కార్యాచరణ పై చర్చించామని మంత్రి అనిత తెలిపారు.

# యురేనియంపై కొనసాగుతున్న ఆందోళన..



కర్నూలు, నవంబర్ 4: కర్నూలు జిల్లాలో యురేనియం తవ్వకాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. దేవనకొండ మండలం ఈదుల దేవరకొండ వద్ద సోమవారం నాలుగు గంటలపాటు ప్రజలు రోడ్డుపై బైఠాయించారు. జిల్లా కలెక్టర్ నుండి ఖచ్చితమైన హామీ వచ్చేంత వరకు ధర్నా విరమించేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించడంతో కర్నూలు- బళ్లారి రహదారిపై రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.

కిలోమీటర్ల మేర వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. ధర్నా విరమింపజేసేందుకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది అష్ట కష్టాలు పడాల్సి వచ్చింది. కలెక్టర్ వచ్చేదాకా ఆందోళన ఆపే ప్రసక్తే లేదని ప్రజలు ముక్తకంఠంతో చెప్పారు. ప్రజలను ఉద్దేశించి పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ మాట్లాడుతూ? కలెక్టర్ కార్యాలయం నుండి ఇప్పుడే సందేశం వచ్చిందని, ఇప్పుడిప్పుడే ఇలాంటి తవ్వకాలు ఈ ప్రాంతంలో జరగని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. రైతులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తవ్వకాలు జరగకుండా చూడాలని అధికారులను ప్రజలు కోరారు. అనంతరం బాధితులు ధర్నా విరమించడంతో వాహనాలు ముందుకు కదిలాయి.

# బీసీ డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు పట్ల మనముదిరాజ్ మహాసభ హర్షం



హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ ల రాజకీయ కోట ను నిర్ణయించటం కోసం హైకోర్టు సూచన కు అనుగుణంగా బీసీ డెడికేషన్ కమిషన్ ను ఏర్పాటు చేస్తూ తెలంగాణా ప్రభుత్వం తీవ్పుకున్న నిర్ణయన్ని తెలంగాణ మనముదిరాజ్ మహాసభ స్వాగతిన్చింది.సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డా చొప్పరి శంకర్ ముదిరాజ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు సుధాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుకూలంగా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ వాటాను నిర్వహించటం కోసం సీఎం రేవంత్ రెడ్డి డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయుటం హర్షనీయమన్నారు., తెలంగాణ లో అత్యధిక శాతం ఉన్న బీసీ ల రాజకీయ ఆర్థిక సామాజిక స్థితిగతులు మార్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. దీని ద్వార రానున్న ఎన్నికల్లో బీసీ లు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు అయ్యే అవకాశం ఉందని అన్నారు, అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ముదిరాజ్ మంత్రి లేకపోటం దురదృష్టం కరమని ఆవేదన వ్యక్తం చేసారు. వెంటనే ముదిరాజ్లకు మంత్రి పదవి కేటాయించాలని డిమాండ్ చేసారు. జనాభా దామాషా ప్రకారం పార్టీలో మరియు ప్రభుత్వం లో ముదిరాజ్ లకు జిల్లా రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ లు ,ఎంఎల్సి పదవులతో సముచిత స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ను కోరారు ఈ సమావేశంలో తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్ , ప్రణీత్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో టెట్ ఫలితాలు విడుదల

అమరావతి నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. టెట్ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. అక్టోబర్ 3 నుంచి 21 వరకు టెట్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీ విడుదల చేసిన అనంతరం అభ్యంతరాలను స్వీకరించి అక్టోబర్ 29న తుది కీ విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా టెట్‌కు 4.27 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 3.68 లక్షల మంది హాజరయ్యారు.

# డెడికేషన్ కమిషన్ ఏర్పాటు పట్ల సీఎం రేవంత్ రెడ్డి కి ఆర్.కృష్ణయ్య కృతజ్ఞతలు

హైద్రాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం డెడికేషన్ కమిషన్ ను ఏర్పాటు చేసినందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు మాజీ రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం నేత శాసనసభ్యులు దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులను ఈ దుస్థితికి తెచ్చింది టీఆర్ఎస్ ప్రభుత్వమే

**-తెలంగాణ పీసీసీరాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్-రాచమల్ల సిద్దేశ్వర్**

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); సర్పంచులను ఈ దుస్థితికి తెచ్చింది టిఆర్ఎస్ ప్రభుత్వమే"నని తెలంగాణ పీసీసీరాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్-రాచమల్ల సిద్దేశ్వర్ అన్నారు.సోమవారం గాంధీ భవన్ లో మేఢియా సమావేశం లో మాట్లాడుతూ ఆనాడైన ఈనాడైన సర్పంచుల దుస్థితికి అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. -సర్పంచులకు విలువలేకుండాచేసి పంచాయతీరాజ్ వ్యవస్థను చెరబట్టింది అప్పటి కేసీఆర్ ప్రభుత్వం-గ్రామ పంచాయతీల నిధులన్నీ ఇతర పనులకు వాడుకొని సర్పంచులు రోడ్డున పడి అడుక్కునెట్టు చేసిన ఘనత టిఆర్ఎస్ పార్టీదే నని విమర్శించారు.-అప్పటి సర్పంచులతో పనులు చేయించి చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా వారు ఆత్మహత్యలు చేసుకునేట్లు చేసింది మీ ప్రభుత్వం కాదా హరీష్ రావ్ అని ప్రశ్నించారు.-రాత్రికి రాత్రి ఫైనాన్స్ కమిషన్ నిధులను డిజిటల్ కీ తో వందల కోట్లు దోచుకున్నది మీ ఘనత హరీష్ రావ్ దే నన్నారు., -ఇప్పుడు నువ్ చెప్తున్న పెండిగ్ బిల్లులన్నీ మీ టిఆర్ఎస్ హయంలోనివి కావా?-సిగ్గులేకుండా పెండింగ్ బిల్లుల గురించి నువ్ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుంది.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆర్టీసీ బస్సు బోల్తా.. పలువురికి గాయాలు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 4: ఆర్టీన బస్సు బోల్తాపడటంతోపలువురు డ్రైవర్‌తో పాటు పలువురు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన యాదాద్రి భువనగిరిజిల్లా చౌటుప్పల్ మండలం బొర్రలగూడెం వద్ద హైవే పై చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను చౌటుప్పల్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎపిలో మరో ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల

అమరావతి, నవంబర్ 4: ఏపీలో తూర్పుగోదావరి-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నేడు షెడ్యూల్ విడుదల చేసింది. తూర్పుగోదావరి-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక కోసం ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఈసీ తెలిపింది. నవంబర్ 18వరకు నామినేషన్లు స్వీకరించి.. 19న నామినేషన్లను పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు నవంబర్ 21గా పేర్కొన్నారు. డిసెంబర్ 5 (గురువారం)న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించి.. డిసెంబర్ 9న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

గతంలో తూర్పుగోదావరి-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ తరఫున గెలిచిన యూటీఎఫ్ నేత షేక్ సాబ్జీ గతేడాది డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన పదవీ కాలం 2027 మార్చి 29 వరకు ఉండటంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.

# 9న చంద్రబాబు చేతుల మీదుగా శ్రీశైలం సీ ప్లేన్ సర్వీస్ ప్రారంభం!





అమరావతి, నవంబర్ 4:శ్రీశైలాన్ని తిరుమల తరహాలో ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇందులో భాగంగా శ్రీశైలం వద్ద సీ-ప్లేన్ సర్వీసును ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9న నంద్యాల జిల్లా శ్రీశైలంలో సీఎం చంద్రబాబు నాయుడు ఏపీలో పర్యటించనున్నారు.ఈ పర్యటనలో భాగంగా శ్రీశైలం పాతాళగంగలోని కృష్ణానది, బెజవాడ ప్రకాశం బ్యారేజీ ల్యాండింగ్ పాయింట్లుగా సీ-ప్లేన్ సర్వీసును సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. సీఎం చంద్రబాబు సందర్శించనున్న ప్రాంతాల్లోని రోప్-వే, బోట్ తదితర ప్రాంతాల్లో సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు.

ఇక, సీప్లేన్ అందుబాటులోకి వస్తే పర్యాటకంగా అటు విజయవాడ, ఇటు శ్రీశైలం అభివృద్ధికి ఎంతగానో దోహద పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఒక రోజులోనే రెండు పుణ్యక్షేత్రాలను దర్శించుకునే అవకాశం పర్యాటకులు, భక్తులకు లభించనుంది. ఈ సీ ప్లేన్ లు పర్యాటకంగానే కాకుండా మెడికల్ ఎమర్జెన్సీలో, ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఉపయోగపడతాయి.

# బైక్ చోరీలకు పాల్పడే ముఠా పట్టివేత

**-ఎనిమిది మంది అరెస్టు**

**-27బైక్‌ల స్వాధీనం**

**-నిందితులంతా ఏపీకి చెందినవారు**




సూర్యాపేట, నవంబర్ 4: జిల్లాలో పార్క్ చేసి ఉంచిన బైక్‌లను చోరీకి పాల్పడుతున్న ముఠాను సూర్యాపేట జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఏపీకి చెందిన ఎనిమిది మంది సభ్యులు పలు ప్రాంతాల్లో పార్క్ చేసిన విలువైన బైక్‌లను దొంగతనం చేస్తున్నారు. వారి నుంచి సుమారు 27బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితులు ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రూ.25.10 లక్షల విలువైన బైక్‌ల స్వాధీనం..

బైక్‌ల చోరీ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న 27బైకుల విలువ సుమారు రూ.25.10 లక్షలు ఉంటుందని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుల నుంచి ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్ లు, ఏడు యూనికర్న్ లు, పది పల్సర్లు, 2 హెచ్ఎఫ్ డీలక్స్, ఒకటి షైన్, ఒకటి హోండా పాషన్ ఉన్నాయని వివరించారు.

# యువనేత గోపిని పరామర్శించిన మంత్రి పొంగులేటి



ఖమ్మం, నవంబర్ 4: (నేటినిజం ప్రతినిధి):ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న యువనేత గోపీని ఖమ్మం రూరల్ మండలం ఎం.వి.పాలెంలోని అతని ఇంటివద్ద పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# ఘనంగా సింగపూర్ తెలుగు బ్రాహ్మణ సమాజం దశమ వార్షికోత్సవం



హైదరాబాద్, నవంబర్ 4: లోకా సమస్తాః సుఖినోభవంతు సర్వేజనా సుఖినోభవంతు అనే భావనతో పదేండ్ల క్రితం ప్రారంభమైన సింగపూర్ తెలుగు బ్రాహ్మణ సమాజం 2 నవంబర్, 2024 నాడు దశమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీ మహా త్రిపుర సుందరీ సమేత శ్రీ ఉమా సహస్ర లింగార్చన పూర్వక హరిద్రా కుంకుమార్చన సహిత లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి వారిని అర్చన చేసుకోవటానికి

దాదాపుగా 50 మంది తెలుగు బ్రాహ్మణ రుత్వికులు పాల్గొన్నారు.

కార్తీక మాసం మొదటి రోజు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని లిటిల్ ఇండియాలోని ఆర్య సమాజ్ ప్రాంగణములో 12 గంటలు పైగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ పుణ్యాహవచనంతో మొదలుకొని మృత్తికా శోధన కార్యక్రమంతో మహాన్యాసా పూర్వకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా భారత్ నుంచి తెప్పించిన శ్రేష్ఠమైన పుట్టమన్నుతో 1136 మహా పరమశివ లింగాలు చేశారు. వాటిని సమంత్ర పూర్వకంగా మూల మంత్రంతో ఆవరణ అర్చన చేశారు. అరుణ పారాయణం చేసిన పిదప ఏకాదశ వార రుద్రాభిషేకం శ్రీ రుద్ర పూర్వకంగా చేశారు. అనంతరం సూక్తముల పారాయణా సహితంగా వేదోక్త శాంతులయిన దశశాంతులతో శ్రీ సహస్ర లింగేశ్వరుని సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. చిన్న విరామం అనంతరం 50 మంది దంపతులు కలసి లలిత సహస్రనామములతో హరిద్రాకుంకుమార్చన నిర్వహించారు. అనంతరం శివ సహస్రనామ పూర్వక లక్ష బిల్వార్చనా అంతర్గత రుద్రాక్రమార్చన పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరగా షోడశ ఉపచారా పూజ, దర్బార్ సేవతో ప్రదోష వ్రతం కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

ఈ కార్యక్రమాన్ని సింగపూర్ బ్రాహ్మణ సమాజ బ్రహ్మలు ప్రసాద్ కప్పగంతుల, నేమాని సత్య రమేశ్, రాజేష్ శ్రీధర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇండియా నుంచి వచ్చిన సలక్షణ ఘనాపాటి వంశీ(రాధే) పాల్గొని కార్యక్రమానికి సహకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇటువంటి పెద్ద కార్యక్రమం భారతదేశంలోనే చాలా అరుదుగా జరుగుతుందని అన్నారు. అలాంటిది సింగపూర్‌లో మొట్టమొదటి సారిగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వర్కింగ్ టీం సభ్యులు గణపతి శాస్త్రి ఆకెళ్ళ, సూర్య పవన్ యనమండ్ర, వంశీకృష్ణ శిష్ట్లా , ముఖ్యదాతలు రంగనాథ్ వల్లభజోస్యుల, ఆదిత్య కర్రా , రామన్, భాను ఆకుండి, సంపూర్ణ స్వదేశ్, వీర ఫ్లవర్స్, వేద ఫ్లవర్స్ వాలంటీర్స్ అందరికీ కృతజ్ఞతలు తెలియచేశారు. అలాగే ఆర్యసమాజ్ వారికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రిత్విక్‌లకు, భక్తులకు పెరుమాళ్ దేవాలయం నుంచి తెప్పించిన ప్రసాద వితరణ చేశారు.

ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు శ్రీప్రదాయ చల్లా, రాజేశ్ యనమండ్ర, వేణు మాధవ్ మల్లవరపు, రత్నకుమార్ కవుటూరు ధన్యవాదాలు తెలిపారు.

# కూటమి నేతలు సమన్వయంతో పనిచేయాలి : మంత్రి నిమ్మల



కర్నూలు , నవంబర్ 4: జనరల్ ఎలక్షన్స్ లో కూటమి 93శాతం స్ట్రైక్ రేట్ తో గెలిచిందని, ఇంక ముందు జరిగే అన్ని ఎన్నికల్లోనూ 93శాతం స్ట్రైక్ రేట్ దాటేలా కూటమి నేతలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రిగా కర్నూలు జిల్లా తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాలు, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ల ఎన్నికల్లో గెలుపుదిశగా కూటిమి నేతలు పనిచేయాలన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేస్తామ న్నారు. రాయలసమ వరప్రదాయని హంద్రీనీవా ప్రాజెక్టు సామర్ధ్యం పెంచేలా ఈనెలలో పనులు పునఃప్రారంభిస్తామన్నారు.

వలసలను అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. సీజనల్ హాస్టల్స్ ను ప్రారంభించేలా మంత్రి నారాలోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. వెంటిలేటర్ పై ఉన్న వైసీపీ అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. కూటమి నేతల మధ్య వివాదాలు అంటూ సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారన్నారు. ఉచిత ఇసుకను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఉన్న 8లక్షల ఎకరాల్లో 20శాతానికి కూడా సాగు నీరందడం లేదన్నారు. ఎవరేమనుకున్నా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మరో 30ఏళ్లు ఉంటుందన్నారు. దానికి తగ్గట్టుగా నాయకులు సిద్ధమై పని చేయాలన్నారు. నాయకులను వదులుకుంటాం కానీ 3పార్టీల పొత్తు మాత్రం వదులుకోమని గుర్తించాలన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టులో 2014- 19 లో చేసిన పనులు తప్ప, వైసీపీ పాలనలో ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. రాజధాని అమరావతి నుండి కర్నూలు రావడానికి ఒక్క ట్రైన్ సదుపాయం కూడా లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో యురేనియం నిక్షేపాల సర్వేకు అనుమతులిచ్చి, ఇప్పుడు వైసీపీ నేతలు ఆందోళనలు చేస్తున్నారన్నారు. యురేనియం సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, టమాటా, ఉల్లి రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూల్ లో డ్రోన్ హబ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

# విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ - పవన్ కళ్యాణ్

**-అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్ష**
**-విద్య, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రగతి సాధన దిశగా అడుగులు**
**-గొల్లప్రోలు బాలుర జెడ్పీ పాఠశాల విద్యార్థులతో పవన్ ముఖాముఖి**
**-స్కూల్‌లో సైన్స్ ల్యాబ్ ప్రారంభం**

అమరావతి, నవంబర్ 4: పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. విద్య, క్రీడలు, శాస్త్ర మరియు సాంకేతిక రంగాల్లో ప్రగతి సాధన దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఉదయం పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గొల్లప్రోలులోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్కూల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్ ని ప్రారంభించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా సంభాషించారు.



పిఠాపురం నియోజకవర్గానికి శాసన సభ్యుడిగా కాకుండా మీలో ఒకడిగా ఒక్క నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే చాలు అన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.

నేను చదువుకునే రోజుల్లో నాయకులు ఎలా ఉండాలి అని ఊహించుకున్నానో.. అలా నేను ఉండాలని ప్రయత్నం చేస్తున్న. విద్యార్థులు ఎంత బాగా చదువుకుంటే దేశం అంత అభివృద్ధి చెందుతుంది.

పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగు నీరు, ఆట స్థలాలు బాగుంటే ఆహ్లాదకర వాతావరణంతో విద్యార్థులు బాగా చదువుకుంటారు.

విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యం.

విజువల్ థింకింగ్ మీద దృష్టి సారించాలి. డ్రాయింగ్ స్కిల్స్ బాగుంటే చదివిన చదువు కూడా ఎక్కువగా గుర్తు ఉంటుంది.

ఉపాధ్యాయులు మైండ్ మ్యాపింగ్ మీద దృష్టి సారించాలి. అవసరం అయితే మైండ్ మ్యాపింగ్ మీద వర్క్ షాపు నిర్వహించాలి

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు హామీ

విద్యార్థులతో ముఖాముఖీ సమావేశంలో భాగంగా పవన్ కళ్యాణ్ తరగతి గదిలోని ప్రతీ విద్యార్థి పేరు అడిగి తెలుసుకుని కరచాలనం చేశారు. పాఠశాలకు ఇంకా ఏమైనా సౌకర్యాలు కావాలా అని ఆయన అడిగారు. కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. తక్షణం స్కూలు ప్రధాన ఉపాధ్యాయురాలిని పిలిచి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు ఎన్ని కంప్యూటర్లు కావాలని ఆరా తీశారు. త్వరలోనే పిఠాపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ కంప్యూటర్ ల్యాబ్ లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# కోల్ ఇండియా 50వ వ్యవస్థాపక దినోత్సవం: వికసిత భారత్ దిశగా సంకల్పం

న్యూఢిల్లీ, నవంబర్ 4:బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) 50వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కలకత్తాలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవగా, బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. అయిదు దశాబ్దాలుగా దేశ ఇంధన రంగానికి సీఐఎల్ అందించిన విశేష సేవలను గుర్తు చేసుకోవడమే కాకుండా, భవిష్యత్ కార్యక్రమాలు, వ్యూహాత్మక నిర్దేశాలకు ఈ కార్యక్రమం వేదికైంది.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి గోల్డెన్ జూబ్లీ లోగోను, 'అంగార' చిహ్నాన్ని ఆవిష్కరించారు. భారత ఇంధన రంగానికి వెన్నెముకగా సీఐఎల్ కీలక పాత్రను సూచించేలా ఉన్న లోగో- సృజనాత్మకత, పురోగతి, సుస్థిరతల్లో కంపెనీ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. మరోవైపు, బొగ్గుగని కార్మికుల ధైర్యసాహసాలు, అంకిత భావాన్ని వెల్లడిస్తూ, వారి శక్తియుక్తులను చిహ్నం ప్రతిబింబిస్తుంది. రాయల్ బెంగాల్ టైగర్ స్ఫూర్తితో ఆ చిహ్నాన్ని రూపొందించారు.

శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ కార్యాచరణలో 50 ఏళ్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) అధికారులు, సిబ్బంది, కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

బొగ్గు ఉత్పత్తిని పెంచడం, సరఫరాను మెరుగుపరచడం ద్వారా దిగుమతులను తగ్గించడంపై సీఐఎల్ ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. గని కార్మికుల సంక్షేమం, గనుల మూసివేతతో ప్రభావితులైన వారి పునరావాసం ప్రాధాన్యాన్ని మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు.

"కోల్ ఇండియా ఉత్పత్తుల్లో ఒప్పంద కార్మికులది కీలక పాత్ర. వారి కోసం పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలను అమలు చేయాలని యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నాను. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి అమలవుతుంది'' అని ఆయన అన్నారు.

వేలం ద్వారా బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించి, బొగ్గు ఉత్పత్తిని పెంచడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో 2015లో బొగ్గు గనుల ప్రత్యేక నిబంధనల (సిఎంఎస్పీ) చట్టం రూపొందించడాన్ని మంత్రి ప్రస్తావించారు. ఉక్కు, సిమెంట్, విద్యుత్ సంస్థల వంటి రంగాలకు తగినంత బొగ్గును అందించడంలో ఇది కీలకమవుతోంది. 2020లో వాణిజ్య పరంగా బొగ్గుగనుల తవ్వకాన్ని ప్రారంభించడం ద్వారా పారదర్శకత, సులభతర వాణిజ్యం, పెట్టుబడి అవకాశాలను కల్పించడంతో పాటు బొగ్గు రంగాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిందని కూడా మంత్రి చెప్పారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ పరిస్థితుల్లో పోటీ సామర్థ్యం, నిబద్ధత కంపెనీకి ఉందని ధీమా వ్యక్తంచేశారు.

వచ్చే దశాబ్దాల్లో భారత ఇంధన రంగంలో బొగ్గు ప్రధాన భాగంగా ఉంటుందని పునరుద్ఘాటించిన శ్రీ కిషన్ రెడ్డి పునరుత్పాదక ఇంధనం, వాతావరణ మార్పు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, కీలకమైన ఖనిజాల సేకరణకు శ్రీకారం చుట్టడం సహా సీఐఎల్ పనితీరును ఆయన అభినందించారు. వికసిత భారత్ కార్యక్రమంలో కోల్ ఇండియాది కీలక పాత్ర అని, సంస్థ తన బాధ్యతను భుజానికెత్తుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ ప్రసంగిస్తూ దిగుమతి చేసుకున్న బొగ్గుతో పోలిస్తే తక్కువ ధరలకే భారతీయ వినియోగదారులకు సీఐఎల్ బొగ్గును అందిస్తోందన్నారు. విద్యుత్ ప్లాంట్లలో బొగ్గు నిల్వలు 2024 అక్టోబర్ 28 నాటికి 31.6 మిలియన్ టన్నులకు చేరుకున్నాయని, గతేడాది ఇదే సమయానికి అవి 18.8 మిలియన్ టన్నులుగా ఉన్నాయని తెలిపారు. సీఐఎల్ కృషి కారణంగా 68 శాతం వృద్ధి నమోదైందన్నారు. వాణిజ్య ధోరణుల్లో మార్పులకు అనుగుణంగా కోల్ ఇండియా తన ప్రక్రియలు, నిర్వహణ, వ్యయ సామర్థ్యాన్ని పునర్వ్యవస్థీకరించాలని కూడా బొగ్గు శాఖ కార్యదర్శి అన్నారు.

బొగ్గు, లిగ్నైట్ అన్వేషణపై వ్యూహాత్మక నివేదికను కూడా శ్రీ కిషన్ రెడ్డి విడుదల చేశారు. గనుల మూసివేత వెబ్ సైటును ప్రారంభించడంతోపాటు, నార్తర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ కు చెందిన నిగాహి ప్రాజెక్టు వద్ద రూ. 250 కోట్ల పెట్టుబడితో 50 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటును అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సౌర ప్రాజెక్టు ద్వారా 49 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. సంస్థాగత, వ్యక్తిగత విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందించడం ద్వారా కార్యక్రమం ముగిసింది. సీఐఎల్ విజయంలో వారి కృషి విశేషమైనదన్నారు.

కీలక ఘట్టానికి చేరిన ఈ సందర్భంగా... దేశానికి సుస్థిర వృద్ధి, ఇంధన భద్రతను అందించడంలో తన నిబద్ధతను కోల్ ఇండియా పునరుద్ఘాటించింది. మున్ముందు భారత ఇంధన రంగానికి మూలాధారంగా తన పాత్ర కొనసాగిస్తూనే కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి, అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సీఐఎల్ సిద్ధంగా ఉంది.

# రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వాకాదాని శ్రీనివాస్ రావు, ఉమారాణి ఎన్నిక



ఖమ్మం, నవంబర్ 4: (నేటినిజం ప్రతినిధి):ఖమ్మం నగర,అర్బన్ మండల రేషన్ షాపుల డీలర్ల సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా వాకాదాని శ్రీనివాస రావు, వై.ఉమారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మం నగరంలోని ఉదారి రామకృష్ణ మినీ ఫంక్షన్ హాల్ లో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 90 మంది డీలర్లు ఏకగ్రీవ తీర్మానం చేస్తూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా లగిశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా గోళ్ల మురళి, మీడియా, టెక్నీకల్ సెక్రెటరీగా ఆర్.సాయి కృష్ణ, లీగల్ కార్యదర్శిగా షేక్.లాల్ జాన్ పాషా లను ఎన్నుకున్నారు. వీరితో పాటు 22మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. నూతన అధ్యక్ష,కార్యదర్శులు ఈసందర్భంగా మాట్లాడుతూ...రేషన్ షాపు డీలర్ల సంక్షేమం కొరకు కృషి చేస్తామని తెలిపారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని డీలర్లు సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

# ఒక్కరోజే రూ.1300 తగ్గిన బంగారం.. అదే బాటలో వెండి ధర.. కారణమిదే..!

న్యూఢిల్లీ, నవంబర్ 4:గతవారం ధగధగ మెరిసిన బంగారం, వెండి ధరలు సోమవారం భారీగా తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.1300 తగ్గి రూ.81,000లకు పడిపోయింది. స్టాకిస్టులు, రిటైల్ వ్యాపారుల నుంచి భారీ అమ్మకాలు జరగడం వల్లే బంగారం ధరలు తగ్గాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. గురువారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.82,400 పలికితే, శుక్రవారం బెంగళూరులో రూ.83,050లతో జీవిత కాల గరిష్ట రికార్డు నెలకొల్పింది. అలాగే కిలో వెండి ధర రూ.4,600 క్షీణించి 94,900 వద్ద స్థిర పడింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో డిసెంబర్ డెలివరీ బంగారం కాంట్రాక్ట్స్ తులం ధర రూ.329 పడిపోయి 78,538లకు చేరుకున్నది. కిలో వెండి డిసెంబర్ డెలివరీ ధర రూ.412 పతనమై రూ.95,071 వద్ద స్థిర పడింది.

మరో రెండు రోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడడంతోపాటు మరో దఫా వడ్డీరేట్ల తగ్గింపు విషయమై యూఎస్ ఫెడ్ రిజర్వు నిర్ణయం వెల్లడించనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్స్‌లో మిశ్రమ ధోరణి నెలకొంది. ఎంసీఎక్స్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.78,000-79,000 మధ్య స్థిర పడుతుందని బులియన్ మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఒడిదొడుకులకు గురి అవుతున్నాయి. కామెక్స్ గోల్డ్‌లో ఔన్స్ బంగారానికి 2730 డాలర్లతో ముగిసింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 3.6 డాలర్లు పుంజుకుని 2752.80 డాలర్ల వద్ద స్థిర పడింది. మరోవైపు కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్ మార్కెట్లో ఔన్స్ వెండి ధర 32.94 డాలర్లకు చేరుకున్నది.

# ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి -అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం, నవంబర్ 4 : ప్రజావాణి దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ ) డా.పి.శ్రీజ అన్నారు. ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ ( ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్) డాక్టర్.పి.శ్రీజ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా రావాలని, ఎవరూ రాకుండా ఉండొద్దన్నారు.

ఏయే శాఖల నుంచి ప్రజావాణికి వచ్చారు, ఎవరు రాలేదని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా వరద ప్రవాహ బాధితులు వస్తున్నందున వారి స్టేటస్ ఏమిటో చూసి వాళ్లకి అర్థమయ్యే విధంగా వివరించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. మామిళ్ళగూడెం నుంచి ఒక దరఖాస్తుదారుడు తన ఇంటి వద్ద చెట్టు కూలిపోయే స్థితిలో ఉన్నందున డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపించి తొలగించాలని అడగ్గా శానిటేషన్ సూపర్ వైజర్ వెళ్లి చూసి అనంతరం డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకొని వెళ్లి తొలగించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

# ఫ్లెక్సీలు కడుతుండగా కరెంట్ వైరు తగలడంతో నలుగురు మృతి

అమరావతి నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతుండగా కరెంట్ వైరు తగలడంతో నలుగురు మృతి చెందారు. మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు కృష్ణ, నాగేంద్ర, మణికంఠ, వీర్రాజు అని తెలిపారు. మృతదేహా లను శవ పరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. దాడిపర్రు గ్రామం ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో నలుగురు చనిపోవడంతో విషాదచాయలు అలుముకున్నాయి.

# ప్రభుత్వ ఈ-మార్కెట్ ప్లేస్ (జీఈఎం)లో..170 విభాగాల్లో 8 వేల రకాల విత్తనాలు

న్యూఢిల్లీ, నవంబర్ 4:వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాల లభ్యతను సులభతరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ ఈ- మార్కెట్ (జెమ్) పోర్టల్లో 8 వేల రకాల విత్తనాలను అందుబాటులో ఉంచుతారు. విత్తనాలను 170 విభాగాలుగా వేరు చేసి ఉంచింది. సీజను ఆరంభానికి ముందుగా రూపొందించిన ఈ నూతన విభాగాల్లో దాదాపు వేలాది రకాల విత్తనాలు లభిస్తాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పీఎస్‌యూలు, ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా వీటిని సేకరిస్తారు.

రాష్ట్రాల విత్తన సంస్థలు, పరిశోధనా విభాగాలతో సహా నిపుణులతో సంప్రదించిన అనంతరం విత్తన సేకరణకు సంబంధించిన నియమావళిని రూపొందించారు. అందులో భాగంగానే నూతన విభాగాలను ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన నియమాలు, నిబంధనలకు అనుగుణంగా విత్తన సేకరణ ప్రకియను సులభతరం చేస్తాయి.

జెమ్ పోర్టల్ విస్తృత వ్యూహంలో భాగంగా... విభాగాల వారీగా సేకరణను ప్రోత్సహించేందుకు నూతన కేటగిరీలను ప్రారంభించారు. ఇది విభాగ ఆధారిత విత్తన సేకరణకు ప్రభుత్వం చేపట్టే టెండర్ల పక్రియలో సమయాన్ని తగ్గించి, పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించి, సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేస్తుంది. అదే సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కూడా కృషి చేస్తుంది.

"నూతనంగా ఏర్పాటు చేసిన విత్తన కేటగిరీల ఆధారంగా... విక్రేతలు ప్రభుత్వ టెండర్లలో స్వేచ్ఛగా పాల్గొని, విత్తనాలను సరఫరా చేయాల్సిందిగా మేం ఆహ్వానిస్తున్నాం. నాణ్యమైన విత్తనాలను తక్కువ ధరలో కొనుగోలు చేసేందుకు ఈ కొత్త కేటగిరీల సౌలభ్యాన్ని ఉపయోగించుకోవాలని విత్తన సంస్థలు, రాష్ట్ర విభాగాలను ప్రోత్సహిస్తున్నాం" అని జెమ్ డిప్యూటీ సీఈవో శ్రీమతి రోలి ఖరే తెలిపారు.

# హర్యానాలోని అంబాలలో ప్రారంభమైన భారత్-వియత్నాం సంయుక్త సైనిక విన్యాసాలు - 'విన్బాక్స్ 2024'


న్యూఢిల్లీ, నవంబర్ 4:భారత్-వియత్నాం సంయుక్త సైనిక విన్యాసాలు - 'విన్బాక్స్ 2024', అయిదో సంచిక కార్యక్రమాలు ఈ రోజు హర్యానాలోని అంబాలాలో ప్రారంభమయ్యాయి. 2023లో వియత్నాంలో జరిగిన విన్యాసాలకు కొనసాగింపుగా 'విన్బాక్స్ 2024' - అంబాలా, చండీమందిర్- రెండు ప్రాంతాల్లో నవంబర్ 04 నుంచీ 23వ తేదీ వరకూ జరుగుతాయి. భారత్?వియత్నాంల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ విన్యాసాలు కీలకంగా మారాయి.

ఈ సంచికలో ఇరుదేశాల ఆర్మీతోపాటు వాయుసేన కూడా పాల్గొనడంతో కార్యక్రమం మరింత విస్తృమైంది. భారత సైన్యం తరపున 'రెజిమెంట్ కోర్ ఇంజనీర్లు' 47 మంది సహా ఇతర విభాగాల సిబ్బంది కూడా పాల్గొంటున్నారు. వియత్నాం పీపుల్స్ ఆర్మీ బలగాలు సమాన సంఖ్యలో పాల్గొంటున్నాయి.

విన్బాక్స్-24- సహకార సైనిక పటిమను పటిష్ఠపరిచేందుకు ఉద్దేశించిన కార్యక్రమం. ఐక్యరాజ్య సమితి ప్రణాళికా పత్రం- ఏడో అధ్యాయంలో భాగమైన 'ఐరాస శాంతి సంరక్షణ' కార్యకలాపాల్లో ఇంజనీరింగ్ సేవలందించేందుకు, ఇరుదేశాల ఇంజనీర్ల, వైద్య సేవల బృందాలను ఈ కసరత్తులు సిద్ధం చేస్తాయి.

గతంలో జరిపిన విన్యాసాల పరిధిని విస్తృతపరుస్తూ, క్షేత్రస్థాయిలో శిక్షణను అందించే విన్బాక్స్-2024, ఇరుదేశాల దళాలను మరింత పటిష్ఠపరుస్తుంది. తద్వారా, పరస్పర విశ్వాసం పెంపు, సహ నిర్వహణ, ఉత్తమ పద్ధతుల వినిమయం సాధ్యమవుతుంది. ఇదే సమయంలో సైనిక ఉత్పత్తుల ప్రదర్శనలు కూడా ఏర్పాటయ్యాయి. మానవతా సహాయం, విపత్తు నిర్వహణ అంశాల్లో దళాల సంసిద్ధతను 48 గంటల పాటు నిర్వహించే పరీక్ష ఆధారంగా తెలుసుకొంటారు. గతంలో సాంకేతికపరమైన సైనిక చర్యల్లో ఐరాస దళాలు చూపిన పాటవం నేపథ్యంలో ఇరుదేశ దళాల ప్రస్తుత స్థాయిని అంచనా వేస్తారు. సంయుక్త విన్యాసాల ద్వారా భాగస్వామి దేశం సాంఘిక, సాంస్కృతిక వారసత్వాన్ని అవగాహన చేసుకునే అవకాశం ఇరుదళాలకూ కలుగుతుంది.

# కొడంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా లిల్లీ మేరి



కొడంగల్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ప్రభుత్వం నూతనంగా కొడంగల్ నియోజకవర్గంలో మంజూరు చేసిన బిఎస్సి నర్సింగ్ కళాశాలకు ప్రిన్సిపల్ గా లిల్లీ మేరిని నియమించింది. నేడు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ను కొడంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం నుండి నేటి వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ కళాశాల అడ్మిషన్ ప్రక్రియ జరిగిందని తెలిపారు. నర్సింగ్ కళాశాలలో మొత్తం 60 సీట్లకు ప్రభుత్వము అనుమతి ఇచ్చిందని ఆమె తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫై చేసి విద్యార్థులను కళాశాలలో చేర్చుకున్నామన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ను కొడంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి మర్యాదపూర్వకంగా కలిసి నర్సింగ్ కళాశాలకు బిల్డింగు మరియు వసతులను కల్పించాలని ఆమె కోరారు.

# రాష్ట్రంలో నిత్యం అరెస్టుల పర్వమే కొనసాగుతోంది

**-తెలంగాణ వ్యాప్తంగా మాజీ సర్పంచులు అరెస్టును ఖండించిన కేటీఅర్**

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ వ్యాప్తంగా మాజీ సర్పంచులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. సోమవారం కెటిఆర్ తన ట్విట్టర్ లో ట్వీట్ చేశారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాది కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో నిత్యం అరెస్టుల పర్వమే కొనసాగుతోందని, పోలీసులతో సమస్యలను అణగదొక్కాలని ప్రభుత్వం చూస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలోని సమస్యలు గాలికి వదిలి ముఖ్యమంత్రి, మంత్రులు ఊరేగుతున్నారని కెటిఆర్ ధ్వజమెత్తారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా.., శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన సర్పంచులను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని ప్రశ్నించారు. పల్లె ప్రగతి పేరిట తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచి నిధులు విడుదల చేయకుండా ఆపుతునారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన సర్పంచ్లను వెంటనే విడుదల చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

# మాజీ సర్పంచులపై కపటప్రేమ చూపిస్తున్న మాజీ మంత్రి హరీష్ రావు

**-ఆనాడు సర్పంచుల ఆత్మహత్యలకు కారణం గత ప్రభుత్వమే**
**-కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాసుగౌడ్**

ఖమ్మం, నవంబర్ 4: (నేటినిజం ప్రతినిధి):కొణిజర్ల మండల విలేకర్ల సమావేశంలో పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ ఈ విదంగా మాట్లాడుతూ...మాజీ మంత్రి హరీష్ రావు మాజీ సర్పంచులపై కపటప్రేమ చూపిస్తున్నారని తీవ్రంగా ఖండించిన పెద్దమునగాల మాజీ గ్రామ సర్పంచ్,జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్. గ్రామపంచాయతీలు ఈరోజు దీనగానస్థితిలో ఉండటానికి కారణం గత ప్రభుత్వ నిర్లక్ష్యం కాదా...గ్రామ సర్పంచులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవడానికి గల కారణం మీ మామ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాదా...అని సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వం రెండు సంవత్సరాల పాటు పంచాయతీ అకౌంట్లో నిధులు వేయకపోగా ప్రతి గ్రామపంచాయితీలో ట్రాక్టర్లు, పారిశుధ్య కార్మికుల వేతనాలు సర్పంచులే అప్పులు చేసి,భార్యల పుస్తెలతాళ్లు అమ్మి మరి పంచాయతీల ను అభివృద్ధి చేశారు. ఆనాడు మీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతోనే ఈనాడు సర్పంచులు ఆర్థికంగా నష్టపోవడం జరిగింది. దీనికి బాధ్యులు మీ బీఆర్ఎస్ ప్రభుత్వమే, మీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆరె కారణం అని ఆయన మండిపడ్డారు. మీరు ఈనాడు మాజీ సర్పంచులను అడ్డం పెట్టుకొని కపటప్రేమను వలకబోస్తూ రాజకీయం చేయడం హాస్యాస్పదమన్నారు. గత ప్రభుత్వంలో మీరు అధికారంలో ఉన్నప్పుడు నిధులు ఎందుకు విడుదల చేయలేదని రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన మీకు గత ప్రభుత్వంలో గుర్తుకు రానీ సర్పంచులు ఈరోజు గుర్తుకోచ్చారా...మీరు అన్ని కపట నాటకాలు అడుతున్నారని విమర్శించారు.

